www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 19 ఆగస్టు 2023
5
చిత్తూరు



కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ధర్నా



ప్రజాశక్తి - క్యాంపస్, విజయవాడ
'చలో విజయవాడ'లో భాగంగా శుక్రవారం తిరుపతి జిల్లా నుంచి దాదాపుగా 250 మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వ్యవసాయ కళాశాల కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర నాయకులు గండికోట నాగవెంకటేష్ మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి వర్యులు ఎన్నికల సందర్భంగా గెలిచిన తర్వాత అధికారం చేపట్టాక సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని ప్రకటించారని, అందర్నీ రెగ్యులరైజ్ చేస్తారన్న ఆశతో ఎదురుచూస్తున్న తరుణంలో జూన్, 2014 జూన్ నాటికి పనిచేస్తున్న 10,117 మందిని రెగ్యులర్ చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం వలన తీవ్ర ఆందోళనకు అసంతృప్తికి దారి తీస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు, కార్యదర్శులు వరలక్ష్మి, రాకేష్, చంద్రమ్మ, గుణ, సాయి, మునిలక్ష్మి, సరస్వతి, గౌరి, మురళి, భువన పాల్గొన్నారు.

పకడో... పకడో..! 'ఆపరేషన్ బంటి' షురూ..!

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో
ఇటీవల కొండపై చిరుతతో పాటు, ఎలుగుబంటి సంచారమూ భక్తులకు భయాందోళనకు గురిచేస్తోంది. ఓ వైపు 'ఆపరేషన్ చిరుత' కొనసాగుతూ మూడు బోనుల్లో చిక్కాయి. భక్తులకు భద్రత కల్పిస్తూనే 'ఆపరేషన్ చిరుత' కొనసాగుతుందని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి వెల్లడించారు. ఇదిలా ఉండగా శ్రీవారి మెట్టు మార్గంలో ఏడో మైలు వద్ద తరచూ ఎలుగుబంటి సంచరించిన దృశ్యాలు సిసి కెమెరాల్లో రికార్డయ్యాయి. 'పట్టుకోండి చూద్దాం... పకడో... పకడో..' అంటూ ఎలుగుబంటి నిత్యం నడకదారిలో భక్తుల సెల్‌ఫోన్ల చిత్రాలకూ చిక్కుతోంది. దీంతో 'ఆపరేషన్ బంటి'ని టిటిడి ఉన్నతాధికారులు ప్రారంభించారు. నడకదారిలో ఎక్కడా తినుబండారాలు జంతువులకు పెట్టవద్దని, షాపుల వారు సైతం అంగళ్ల వద్ద వ్యర్థాలను వేయరాదని భక్తులను అప్రమత్తం చేస్తున్నారు.

అలిపిరి నుంచి కాలినడకన వెళ్లే భక్తులకు అనేక సందర్భాల్లో ఎలుగుబంటి తారసపడింది. నిత్యం తిరుపతి నుంచి అలిపిరి, శ్రీవారిమెట్టు కాలినడక మార్గాల్లో భక్తులు, వ్యాపారులు నడచి తిరుమలకు చేరుకుంటుంటారు. సాధారణ రోజుల్లో కాలినడకన వెళ్లే భక్తుల సంఖ్య 20-25వేలు ఉంటుంది. వారాంతంలో 30-35వేలు ఉంటుంది. ప్రత్యేక రోజుల్లో కాలినడకన కొండకు చేరుకునే భక్తుల సంఖ్య 40వేలు దాటుతుంది. ఇటీవల కాలంలో నడచి వెళ్లే మార్గంలో వన్యమృగాల సంచారం మరింత ఎక్కువయ్యింది. ఓ వైపు చిరుతలు భయపెడుతుంటే, మరోవైపు ఎలుగుబంటి సంచారం ఆందోళన కలిగిస్తోంది. శ్రీవారి మెట్టు ఏడో మైలు ప్రాంతంలో తరచూ ఎలుగుబంటి సంచరించిన దృశ్యాలు సిసి కెమెరాల్లో రికార్డయ్యాయి. భక్తులు చాలాసార్లు ఎలుగుబంటి కనిపించిన విషయాన్ని టిటిడి సిబ్బంది దృష్టికి తీసుకొచ్చారు. కొంతమంది భక్తులు మొబైల్ ఫోన్‌లోనూ ఎలుగుబంటిని ఫొటోలు తీశారు.

శ్రీవారిమెట్టు ఏడోమైలు వద్ద సిసికెమెరాల్లో రికార్డు



భక్తులు అందించిన సమాచారంతో టిటిడి 'ఆపరేషన్ బంటి' కార్యక్రమం చేపట్టింది. ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపింది. ఇందుకోసం 25 మంది సిబ్బందిని ఇప్పటికే నడకదారిలో ఏర్పాటు చేసింది. ఎలుగుబంటిని బంధించేందుకు ప్రత్యేక బోన్లు, వలలతో ఆపరేషన్ మొదలు పెట్టింది. రెండుసార్లు వలలకు చిక్కినట్లే చిక్కి ఎలుగుబంటి తప్పించుకుంది. 'పట్టుకోండి చూద్దాం' అంటూ బంటి ముప్పతిప్పలు పెడుతోంది. ఎక్కడైతే బంటిని బంధించేందుకు ఏర్పాట్లు చేశారో అక్కడే దైర్యంగా తిరుగుతోంది. భక్తులను ఎప్పటికప్పుడు టిటిడి అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. బంటిని బంధించేందుకు మరో బృందాన్ని రంగంలోకి దించుతోంది. శ్రీవారి భక్తుల్లో భయాన్ని నింపిన ఎలుగుబంటి ఎప్పుడు చిక్కుతుందో చూడాలి మరి.

ఆహార వ్యర్థాలు నడకదారిలో వేయొద్దు : టిటిడి

భక్తులకు టిటిడి కొన్ని సూచనలు చేసింది. నడకదారిలో సాధుజంతువులకు ఎలాంటి ఆహారం ఇవ్వొద్దని టిటిడి హెచ్చరిస్తోంది. వ్యర్థ పదార్థాలను షాపుల బయట వదిలేసేవారిపై చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చింది. భద్రత కోసం డ్రోన్లు వాడనుంది. 30 మీటర్ల దూరం కనబడేలా మెట్ల మార్గంలో ఫోకస్ లైట్లతో పాటు 500 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయనుంది. భక్తులను అప్రమత్తం చేసేలా సైన్‌బోర్డులు ఏర్పాటు చేయనుంది. అలిపిరి, గాలిగోపురం, ఏడో మైలురాయి దగ్గర హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేసి భద్రతపై భక్తులకు అవగాహన కల్పించనున్నారు.

21 లోపు ఇంటింటి సర్వే పూర్తి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024లో భాగంగా ఇంటింటి సర్వే ఈ నెల 21 కల్లా వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా పురోగతిపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, ఎక్స్ అఫిషియో కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలు, ఈఆర్ఓ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్, డిఆర్ఓ యన్.రాజ శేఖర్, ఎన్నికల విభాగం అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా కోసం చేపట్టిన ఇంటింటి సర్వే పురోగతిపై జిల్లాల వారీగా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఫారం 6 కొత్త ఓటర్లు 18 సంవత్సరాలు నిండిన వారికి ఇవ్వాలని, ఫారం 8 చిరునామా మార్పులు కొరకు ఇవ్వాలన్నారు. ఓటర్ల తొలగింపు సంబంధించి ప్రొసీజర్ ప్రకారం జాగ్రత్తగా చేయాలన్నారు. అలాగే పలు అంశాలపై అందుకు సంబంధించిన కార్యాచరణపై జిల్లాలో అన్ని నియోజకవర్గాల ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు దిశానిర్దేశం చేశారు. జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా చేపడుతూ జరుగుతుందని రాష్ట్ర ఎన్నికల అధికారికి కలెక్టర్ తెలిపారు. జిల్లాలో హౌస్ టు హౌస్ డోర్ సర్వేకి సంబంధించి ఇప్పటి వరకు 91.84 శాతం చేయడం జరిగిందని మిగిలినవి కూడా మూడు రోజులలోగా పూర్తి చేయడం జరుగుతుందని, బియల్ఓ యాప్ లో 66.87 శాతం చేయడం జరిగింది, ఫిసికల్ గా 26.78 శాతం చేయడం జరిగిందని మిగిలిన మూడు రోజుల లోగా పూర్తి చేయడం జరుగుతుందన్నారు, జిల్లాలో 100 సంవత్సరాలపై బడిన ఓటర్లు 132 మంది ఉన్నారు, 132 మందిని వెరిఫై చేయడం జరిగిందని అలాగే 43 పార్టీ తీసుకోవడం జరిగిందని సిఈఓ కు కలెక్టర్ తెలిపారు. 6,7,8 ఫారం ద్వారా వచ్చినవి, ఆఫ్ లైన్ నుండి ఆన్‌లైన్ లో అప్ లోడ్ చేయడం జరుగుతుందని తెలిపారు. గత బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశము నిర్వహించి వారికి పూర్తి సమాచారం ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో ఎలక్షన్ సెక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెనాల్టీలు రద్దు చేయాలి



ప్రజాశక్తి-పుంగనూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులపై రకరకాల పేర్లతో పెనాల్టీలు వేయడాన్ని రద్దుచేయాలని జోనల్ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పుంగనూరులో ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో సర్వసభ్య సమావేశం హరినాథ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ జీవో నెంబర్లు 70, 71 లను రాష్ట్ర ప్రభుత్వం తీసుకు రావడం దారుణం అన్నారు. ఇందులో నాయక క్లాజులు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు. ఆర్టీసీ ఉద్యోగులు తుమ్మినా, దగ్గినా శిక్షకు సిద్ధం కండి అనే విధంగా ఉన్నాయని, ఈ రెండు జీవోలను వెంటనే రద్దు చేయాలని ఏపీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్య హక్కును, ట్రేడ్ యూనియన్ నిర్వహణ హక్కును, సమస్యలపై చిన్నపాటి ఆందోళన చేసిన వాటిని కూడా దుష్ప్రవర్తన కింద ప్రభుత్వ యాజమాన్యం కార్మిక వ్యతిరేక చర్యల్లో చేపట్టడం దుర్మార్గమన్నారు. ఆర్టీసీలో ఉన్న కాంటాక్ట్ రెగ్యులేషన్స్ లోని రాజ్యాంగ వ్యతిరేక ఉద్యోగ కార్మిక వ్యతిరేక అంశాలను గతంలో హైకోర్టు కూడా కేసు వేయడం జరిగిందన్నారు. ప్రయాణికుడు టికెట్ తీసుకోకపోతే ఎంఈ చట్టం ప్రకారం ఆయనకు తగిన పెనాల్టీ ఉంటుంది. అయితే దీనికి విరుద్ధంగా కండక్టర్ నిబంధనలు రూపొందించారు. రోడ్డుపై ట్రాఫిక్ కారణంగా బస్సును ఎదుటి వ్యక్తి వాహనం ఢీకొన్న సందర్భాల్లో ఆర్టీసీ డ్రైవర్‌పై చట్టాలు తీసుకురావడం సిగ్గు చేటు. ఆర్టీసీ అధికారులకు విశేష అధికారాన్ని కట్టబెట్టి ఉద్యోగులను విధుల నుండి విచక్షణ రహితంగా తొలగించుటకు ఉద్యోగుల హక్కులను వినియోగించేలా ఉన్నది. ఉద్యోగ భద్రతకు మార్గదర్శక సూత్రాలుగా ఉపయోగపడుతున్న వన్ బార్ 2019 సర్క్యులర్‌లోని అంశాలను విధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబరు 71 లో అప్పిలేట్ వ్యవస్థ గురించి ప్రస్తావించారు. గతంలో 2020లో ముందు ఉన్నటువంటి అప్పిలేట్ దంతరను తగ్గించడం ద్వారా ఉద్యోగులకు తీవ్ర నష్టం అందుచేత దీన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విలీనం చేసిన తర్వాత ఆర్టీసీ ఉద్యోగులకు సరైన సౌకర్యాలు అందుతాయని ఆశతో ఉన్నవారికి నిరాశ ఎదురయింది అన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉద్యోగులపై పెనాల్టీలు రద్దు చేయాలని, మహిళా కండక్టర్లకు కిలోమీటర్లు తగ్గించాలని డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎన్నిక: పుంగనూరు డిపో ఎస్‌డబ్ల్యూఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. గౌరవాధ్యక్షుడిగా వాడ గంగరాజు, అధ్యక్షుడిగా హరిప్రసాద్, కార్యదర్శిగా వాణి రెడ్డమ్మ, కోశాధికారిగా శిరీష, పబ్లిసిటీ కార్యదర్శిగా మమతలతో పాటు ఆరు మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది.

మాంగళ్య షాపింగ్‌మాల్ ప్రారంభం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరంలో హైరోడ్డులో అత్యాధునిక భవనంలో ఏర్పాటు చేసిన మాంగళ్య షాపింగ్ మాల్‌ను ప్రముఖ సినీనటి కాజల్ అగర్వాల్, చిత్తూరు ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు, ఎపిఎస్ ఆర్‌టిసి వైఎస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డిలు శుక్రవారం ప్రారంభించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద షాపింగ్ మాల్ మాంగళ్య చిత్తూరులో ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వరంగల్‌లో 2012లో ప్రారంభమైన మాంగళ్యా షాపింగ్ మాల్ అంచెలంచెలుగా ఎదిగి తమ 16వ మాల్‌ను చిత్తూరులో ప్రారంభించడం వల్ల ఈ ప్రాంత ప్రజలకు మహా నగరాల్లో మాత్రమే లభించే ఫ్యాషన్ వస్త్రాలు చిత్తూరు ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన యాజమ్యాన్ని అభినందించారు. జ్యోతి ప్రజ్వలన చేసి షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన నగర మేయర్ మాట్లాడుతూ మహిళలు ఆదరించే కంచి, ధర్మవరం పట్టు, ఫ్యాషన్ వస్త్రాలు అన్ని మాంగళ్య షాపింగ్‌మాల్ చిత్తూరులోనే అందుబాటులో ఉండటం హర్షనీయమన్నారు. మాంగళ్య షాపింగ్ మాల్ కంప్లీట్ షాపింగ్ మాల్ అన్ని చిత్తూరులో



షాపింగ్ మాల్ ప్రారంభిస్తున్న చిత్తూరు ఎంఎల్ఏ, నగర మేయర్

16వ బ్రాంచ్ ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని ప్రముఖ సినీ నటి కాజల్ అగర్వాల్ అన్నారు. తాను పదిసంవత్సరాలుగా మాంగళ్య షాపింగ్‌మాల్‌తో అనుబంధం ఉందని వ్యక్తిగతంగా తనకు మాంగళ్య షాపింగ్ మాల్ వస్త్రలు ఎంతగానో నచ్చుతాయ్ అన్నారు. వివాహ ఇతర శుభకార్యాలకు చెన్నై, బెంగుళూరు వంటి మహా నగరాలకు వెళ్ళకుండా చిత్తూరులోనే అందుబాటులో ఉంటాయన్నారు. షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాంగళ్య షాపింగ్ మాల్ వ్యవస్థాపకులు పియన్ మూర్తి, ఛైర్మెన్ అండ్ డైరెకర్లు కాసం నమశ్శివాయ, కాసం మల్లిఖార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్, పుల్లూరు వరుణ్, పుల్లూరు విశాల్, తోడుపునూరు కార్తిక్, తోడుపునూరు అరుణ్, కాసం ఫణిత్, కాసం సాయి కృష్ణ తో పాటు నగర ప్రముఖులు పాల్గొన్నారు.



దుస్తులను చూపుతున్న కాజల్ అగర్వాల్

ఎన్నికల ప్రక్రియలో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితాలో సవరణలు అత్యంత ప్రధానమైన ప్రక్రియ అని పెంచిన కాలపరిమితి లోపల ఈ ప్రక్రియను పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు తెలిపారు. జాయింట్ కలెక్టర్ శుక్రవారం తహశీల్దార్లు, బిఎల్ఓ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ శనివారం సాయంత్రం లోపల మార్పులు చేర్పులు ప్రక్రియను పూర్తి చేయాలని ఆఫ్లైన్లో చేసిన వారు ఆన్లైన్ విధానంలో పూర్తిచేసి పంపాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియలు ఓటర్ల ఎన్రోల్మెంట్ విధానం పకడ్బందీగా నిర్వహించాలని ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పులు చేయ కూడదని ఆ విధంగా జరిగి ఉంటే చర్యలు తప్పవని అన్నారు. ఈ సందర్భంగా పలు మండలాలలో జరు గుతున్న ఎన్రోల్మెంట్ విధానం గురించి వారిని ప్రశ్నిం చారు. కార్యక్రమంలో ఆర్డీఓలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

నగర అభివృద్ధిపై చర్చ



ఆహ్వానం పలుకుతున్న స్మార్ట్‌సిటీ డెవలప్‌మెంట్ ప్రతినిధులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడంతో పాటు తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, గ్రీనరీ, పార్కుల ఏర్పాటుపై చర్చించేందుకు రావాలని స్మార్ట్‌సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధులు సత్య, తాండవ మూర్తి, కేశవరెడ్డి, కుమారేషన్‌లు శుక్రవారం నగర మేయర్ అముద, చుడా ఛైర్మన్ పురుషోత్తంరెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి రామకృష్ణలకు ఆహ్వానం పలికారు. చిత్తూరు నగర అభివృద్ధికి స్మార్ట్‌సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ చేస్తున్న కృషికి తోడ్పాటును అందించాలని వారు కోరారు.

యూటీఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలి



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-పలమనేరు: ఈనెల 20వ తేదీ పలమనేరు లయన్స్ క్లబ్‌లో జరగబోయే యూటీఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వి. రమణ సభ్యులకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక యూటీఎఫ్ డివిజన్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశాల ఆహ్వాన పత్రికను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జి.వి.రమణ మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భవించి 49 సం.లు గడిచింది. గత కౌన్సిల్ నాటినుండి నేటి వరకు అమలు జరిపిన కర్తవ్యాలను సమీక్షించుకొని, రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగంలో జరుగుతున్న తాజా పరిణామాల నేపథ్యంలో నూతన కర్తవ్యాలను రూపొందించుకోవడానికి ఈ కౌన్సిల్ సమావేశాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ సిపి ప్రకాష్ మాట్లాడుతూ ఈ సమావేశాలకు ముఖ్య అతిథులుగా పిడిఎఫ్ శాసనమండలి మాజీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రమణ్యం, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటేశ్వర్లు హాజరవుతున్నారని, కాబట్టి జిల్లా కాన్సిలర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు పాల్గొని జయప్రదం చేయాలి అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జి.కృష్ణమూర్తి, కోశాధికారి కె.ప్రసన్నకుమార్, సీనియర్ నాయకులు గురుమూర్తి, పురుషోత్తం, డివిజన్ కన్వీనర్ దయానంద, పిసి బాబు, బషీర్ అహ్మద్, కోదండరెడ్డి, శేఖర్, బాలాజీ పాల్గొన్నారు.

పిల్లలను మంచి మార్గంలో నడిపించే బాధ్యత తల్లిదండ్రులదే


ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిన్నపిల్లలు తెలిసో, తెలియకో తప్పులు లేదా నేరాలు చేయడం జరుగుతుందని వారిని సన్మార్గంలో పెట్టవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ. భీమారావ్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక జిల్లా న్యాయ సదన్ భావనం నందు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ డాక్టర్ ఐ. కరణ్ కుమార్ తో కలిసి పిల్లలు నేరాలు చేయకుండా ఎలా ఆపగలమని అంశానికి సంబంధించి ఒక్కరోజు నిర్వహించిన వర్క్ షాప్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ పిల్లలు ఎవరు కూడా నేరాగాలుగా పుట్టారని, పుట్టిన తర్వాత అనుకోని పరిస్థితుల ప్రభావం, కారణాల వల్ల తెలిసో తెలియకో తప్పులు లేదా నేరాలు చేయడం జరుగుతుందని అలాంటి పిల్లలను సన్మార్గంలో పెట్టవలసిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. సుప్రీం కోర్టు, రాష్ట్ర హైకోర్టు ఆదేశాల సూచనలు మేరకు జిల్లా స్థాయిలో పోలీసు, విద్య, స్త్రీ శిశు సంక్షేమం శాఖలదికారులతో చిన్న పిల్లలు నేరాలకు పాలు పడకుండా వారికి అవగాహన కలిగించుటకుతీసుకోవలసిన జాగ్రత్తలు, నిర్బంధానికి ప్రత్యామ్నాయాలు మరియు సంరక్షక ప్రత్యామ్నాయాలు, చట్టానికి విరుద్ధంగా ఉన్న పిల్లలతో వ్యవహరించే చర్యలు ప్రకారం న్యాయపరమైన చర్యలను ఆశ్రయించకుండా పిల్లలు చేసే నేరాల సాధారణ స్వభావం, మానవ శరీర మాదకద్రవ్య దుర్వినియోగానికి వ్యతిరేకంగా నేరాలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

వంటివి మరియు/లేదా పిల్లలకు సంబంధించిన ఏదైనా ఇతర నేరాలు. జిల్లాలో తీసుకున్న నాన్ కస్టోడియల్ పద్ధతులు33 చట్టంలోని సెక్షన్ 18 ప్రకారం జిల్లాలో మంచి అభ్యాసాల కేస్ స్టడీస్ వంటివి, చేతి సంకెళ్ళు మొదలైన వాటి నుండి రక్షణ,చెడు పద్ధతులు ఏవైనా ఉంటే వాటిని గుర్తించడం. చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టుల గుర్తింపు, పిల్లలతో స్నేహపూర్వక విధానం. జిల్లాలో చట్టంతో సంఘర్షణకు గురైన పిల్లల సూచనతో పునరావాసం, పునరుద్ధరణ పద్ధతులు. న్యాయమైన విచారణ మరియు పిల్లల స్నేహపూర్వక విధానాలకు హక్కుల గురించి వర్క్ షాప్ లో వివిధ శాఖల అధికారు చర్చాండం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ జిల్లా జడ్జి, చైర్మన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో వర్క్ షాప్ ఈరోజు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ వర్క్ షాప్ నిర్వహించడానికి ప్రధానమైన కారణం గౌరవ సుప్రీంకోర్టు, గౌరవ రాష్ట్ర హైకోర్టు మరియు గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారు ఇచ్చిన టువంటి సూచనలు మేరకు వర్క్ షాప్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అసలు ఈ వర్క్ షాప్ ఎందుకు పెడుతున్నామంటే బాల నేరస్తులు లలో పరివర్తన తీసుకురావడం, పిల్లల కోసం మంచి సమాజాన్ని నిర్మించడం కోసం, సామాజిక రాజకీయ ఆర్థిక, అనేక వ్యవస్థల పైన ప్రభావాలు ఉంటుంది కాబట్టి, ఈ ప్రభావాలు అన్ని మేనిమైజ్ చేయాలంటే మరి కచ్చితంగా బాల నేరస్తులను గుర్తించడమే కాకుండా వాళ్లకి ఈ పరివర్తన అన్నది ఏ విధంగా అంటే బాల నేరం చేసిన వెంటనే శిక్ష వేసేయాలి లేదా బాల నేరస్థుల అందర్నీ కూడా సమాజంలో పెట్టకుండా వారిని అలానే స్పెషల్ హోమ్ లో బంధించాలా ఇలాంటి విషయాలను వర్క్ షాప్ ఇది కాన్ఫరెన్స్ కాదు ఇది ఒక వర్క్ షాప్ అంటే ఈ వచ్చినటువంటి అనేక మంది అధికారులు వారి వారి అనుభవాలను మనతోపాటు షేర్ చేసుకుని ఆ షేర్ చేసుకున్న అనుభవాలను మేము ఒక మంచి రిపోర్ట్ ద్వారా హైకోర్టు వారికి, ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవ సంస్థ వారికి సమర్పించడమే ఈ వర్క్ షాప్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి యం.సంధ్యారాణి, డిఎస్పీలు కటంరాజు, సుధాకర్ పాల్గొన్నారు.

కేపీఎస్ విద్యార్థిని డిప్యూటీ కలెక్టరుగా ఎంపిక



ప్రజాశక్తి-కుప్పం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2022 వ సంవత్సరం నిర్వహించిన సివిల్స్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభను కనబరిచి డిప్యూటీ కలెక్టరుగా సాయి ప్రత్యూష ఎంపికైనట్లు బీసీఎన్ విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు బిసి నాగరాజు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సాయి ప్రత్యూషకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో 6 నుండి 10వ తరగతి వరకు చదివిన విద్యార్థిని నేడు డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపిక కావడం తమ విద్యాసంస్థలకే గర్వకారణంగా ఉందని అన్నారు. గతంలో 2012-13 విద్యా సంవత్సరానికి సంబంధించి సాయి ప్రత్యూష కుప్పం పబ్లిక్ స్కూల్ నుండి పదవ తరగతి పరీక్షలకు హాజరై ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఆరవ తరగతి నుండి మంచి క్రమశిక్షణ, పట్టుదల కలిగి చదువులో ప్రత్యేక ప్రతిభ కనబరచడం సాయి ప్రత్యూషలో ఉన్న ప్రత్యేకతగా ఆయన తెలిపారు. అలాంటి గొప్ప లక్షణాలు గల వ్యక్తి మరిన్ని విజయాలు సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.

'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమం తనిఖీ




ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న డిఎంఅండ్‌హెచ్‌వో

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ ప్రభావతి దేవి శుక్రవారం చిత్తూరు నగర 44వ వార్డు పరిధిలోని టీ చౌటపల్లి అర్బన్ హెల్త్ సెంటర్ ఏరియాలోని వీరభద్ర కాలలో 'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున ప్రజలు అందరూ ఎవరికివారు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా ప్రతి శుక్రవారం తప్పనిసరిగా ప్రజలందరూ సమిష్టిగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తే దోమల పెరుగుదల ఆగి, దోమలు పుట్టకుండా, కుట్టకుండా చేయవచ్చు అన్నారు. ఈ దిశగా ప్రజలు జాగ్రత్త పడితే మలేరియా, డెంగీ వంటివి దరిచేరవన్నారు. ఇంటి పరిసరాలలో ఎక్కడైనా ఎక్కువ మోతాదులో నీరు నిల్వ ఉంటే మీకు దగ్గరలోని సచివాలయ శానిటేషన్ సెక్రటరీకి తెలిపితే వారు పరిశుభ్రం చేస్తారని తెలిపారు. నీరు నిల్వ ఉన్న బిందెలు, తొట్టెలు, డ్రమ్ములు వాటిపై మూతలు ఉంచాలని తద్వారా దోమలు గుడ్లు పెట్టవని తెలిపారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి పీరు సాహెబ్, లలిత్, మనోహర్, గోపి, శానిటేషన్ సెక్రటరీ, ఆరోగ్య కార్యకర్త, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయం

ప్రజాశక్తి-పాలసముద్రం: పాలసముద్రం మండలం లోని నరసింహాపురం పంచాయతీ బలిజూరు గ్రామానికి చెందిన మోహన్ ఖాతా నుంచి రోజుకు రూ. 10 వేలు చొప్పున ఎనిమిది రోజుల్లో రూ.80 వేలు మాయమైనట్లు బాధితుడు వాపోయాడు. ఇతనికి సరిహద్దు ప్రాంతంలోని షోళింగర్ సమీపం నాగబూండి ఆంధ్ర బ్యాంకు యూనియన్ బ్యాంకులో ఖాతా ఉంది. ఇతనికి ఎలాంటి సమాచారం లేకుండా రూ.80 వేలు నగదు మాయం అయింది. ఈ విషయంపై చిత్తూరు సైబర్ క్రైం లోనూ, బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేశారు.



తన ఖాతా నుంచి నగదు డ్రా అయినట్లు చూపుతున్న ఖాతాదారుడు

వ్యవసాయ అభివృద్ధికి అగ్రికల్చరల్ ల్యాబ్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక నైపుణ్యాన్ని పలువురు రైతులు చేస్తున్న వ్యవసాయ విధానాలను తెలుసుకొని తిరిగి అవలంబించేందుకు క్షేత్రస్థాయి పర్యటనలతో పాటు ఆదర్శ రైతుల వ్యవసాయ క్షేత్రాలను కూడా పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ పి.రామచంద్రా రెడ్డిఆధ్వర్యం లో నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు, అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ఆదర్శ రైతులు లాభసాటి వ్యవసాయం నకు అను సరిస్తున్న మార్గాలు, అదే విధంగా క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలను నేరుగా చూసి పరిష్కార మార్గాలను శాస్త్ర వేత్తల ద్వారా తెలియ జేయడం బాగుంటుందన్నారు. ఈ సందర్భంగా రైతులకు కావాల్సిన సలహాలు ఇవ్వడం జరుగుతుందని అలా చేయడం వల్ల మంచి ఉత్పత్తులు సాధించవచ్చునన్నారు. అదేవిధంగా జిల్లాలోని పలు పల్ప్ పరిశ్రమలలో వస్తున్న వేస్ట్ ను బందావనాలకు తరలించి సంపదను తయారు చేయడం ద్వారా పంచాయతీ లు ఆర్థికంగా అభివద్ధిచెందేందుకు ఉపయోగ పడతాయని ఆ విధంగా తగు చర్యలు తీసు కోవడం జరుగు తుందన్నారు. పలువురు సభ్యులు ఈ నిర్ణయానికి హర్షం వ్యక్తం చేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మాట్లాడు తూ జాయింట్ కలెక్టర్ గారు వెల్లడించిన అభిప్రాయాలు అనుకూలంగా ఉన్నాయని ఆ విధంగా తగు చర్యలుతీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను కోరారు. జిల్లాలో నగిరి, పలమనేరు లలో అగ్రికల్చరల్ ల్యాబ్ లను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని త్వరలో మిగతా వాటిని కూడా తీసుకు రావడం జరుగు తుందన్నారు. రైతు భరోసా కేంద్రాలలో ఉద్యాన పంటలకు కావాల్సిన ఎరువులు, క్రిమి సంహారక మందులు నిల్వలు ఉంచడం అవసరమని అందుకు కావలసిన ఇండెంట్ లను తయారు చేయాలని వ్యవసాయ,ఉద్యానవన అధికారులను కోరారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ఈ క్రాప్ బుకింగ్ నూతన జియో కోఆర్డినేటర్ ద్వారా జరుగు తోందని అదేవిధంగా ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలు మంజూరులుత్వరలో పలు పథకాలకు సంబంధించి రానున్నాయని తెలిపారు. ఉద్యానవన అధికారి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మామిడి కాయల కోతల అనంతరం తీసుకోవాల్సిన యాజమాన్య చర్యలు గురించి అవగాహనసదస్సులు నిర్వహించడం జరుగుతుందని రైతులు ఈ సదస్సులకు హాజరు కావడం ద్వారా మంచి ఉత్పత్తులు నాణ్యమైన దిగుబడి పొందే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో జెడి సెరికల్చర్ శోభ, జిల్లా పశు సంవర్ధక అధికారి ప్రభాకర్, ఏడి మార్కెటింగ్ పరమేశ్వర్, ఎల్ డి ఎం హరీష్ సభ్యులు పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, గోవర్ధన్ బాబి,శివ ప్రకాష్ రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ రామచంద్రారెడ్డి

సమయపాలన పాటించాలి



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: పంచాయతీ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బంగారుపాళ్యం 1, 2 సచివాలయాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అర్హత ఉండి సంక్షేమ ఫలాలు రానివారిని గుర్తించి వారికి సంక్షేమ ఫలాలు అందే విధంగా చూడాలని తెలిపారు. అలాగే గృహనిర్మాణాలపై దృష్టి సారించి 100% పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో వాలంటీర్లు ప్రతి గడపగడపకూ వెళ్లి సంక్షేమ ఫలాల పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కష్ణమూర్తి, సచివాలయ కార్యదర్శులు శంకరయ్య, అవంతి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాశాఖ అధికారులు నాగేశ్వరరావు, రమేష్ బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని కోలాచారిపురం ప్రాథమిక పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారులు మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, రాగి జావా, చిక్కి, కోడిగుడ్డు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను పరీక్షించేందుకు తల్లిదండ్రులతో సమావేశం, ఆటపాటలతో విద్యా కార్యక్రమాలు చేపడుతున్నట్లు, పిల్లలకు రోజుకో రకంగా భోజనం ఏర్పాటు చేసేందుకు మెనూ అమలు చేస్తున్నామని, ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజనాన్ని వారు రుచి చూసి సంతప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జగదీష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కు సన్మానం




ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ఈనెల 15వ తేదిన స్వాతంత్య్ర దినోత్సవ సందర్భంగా రాష్ట్ర మంత్రి ఉషాశ్రీ చరణ్ చేతుల మీదుగా ఎంపీడీవో శ్రీదేవి ఉత్తమ ఎంపీడీవోగా ప్రశంసా పత్రాన్ని అందుకున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా శుక్రవారం ఆర్‌బీఐ యూనియన్ జాతీయ అధ్యక్షుడు బండి పట్టాభిరెడ్డి, ఆర్‌బీఐ యూనియన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డీకే కుమార్, ఆర్‌బీఐ జిల్లా అధ్యక్షుడు పాచిగుంట రామారావులు కలిసి శ్రీదేవికి శాలువా కప్పి పూలబొకే అందజేసి ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ యూనియన్ నేతలు రాజేష్ కుమార్, లోకనాథ్ నాయుడు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు




ప్రజాశక్తి-బైరెడ్డిపల్లె: మండలంలోని వెంగంవారి పల్లి పంచాయతీ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు నాడు నేడు పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన మూడు స్మార్ట్ టీవీలలో సాఫ్ట్‌వేర్‌లు ఇన్‌స్టాల్ చేసి శుక్రవారం వినియోగంలోకి తీసుకొచ్చినట్లు ప్రధానోపాధ్యాయులు రవీంద్రా నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ సీఎంకు కతజ్ఞతలు తెలిపారు. విద్యాభివృద్ధికి ఆధునాతన టెక్నాలజీని ప్రభుత్వ పాఠశాలలో వ్యయప్రయాసలు కూర్చి అందుబాటులోకి తీసుకువచ్చిన మొట్టమొదటి ముఖ్యమంత్రి అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పి రామచంద్ర, పాఠశాల ఉపాధ్యాయులు శశికుమార్, రవి, రూబీన్ రాణి, నాగరాణి, రెడ్డెమ్మ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న సభాస్థలి



ప్రజాశక్తి-నగరి: ఈనెల 28న జగనన్న విద్యాదీవెనను నగరి పట్టణంలో ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించనుండటంతో దానికి సంబంధించిన సభావేదిక ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. శుక్రవారం మున్సిపల్ పరిధి ఏపీ టూరిజం భవనానికి సమీపంలో అధికారులు ఎంపికచేసిన సభాస్థలిని చదునుచేసే పనులను అధికారులు ప్రారంభించి వేగంగా నిర్వహిస్తున్నారు.

నేడు కాశేపల్లిలో రెండో వార్డు ఎన్నికలు



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని కాశేపల్లిలో రెండవ వార్డుకు శనివారం ఎన్నికలు జరుగనున్నట్లు ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఎన్నికలు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు జరుగుతాయని, కావున ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలని, రెండు గంటల నుండి ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత విజేతను ప్రకటిస్తామని తెలిపారు. ఈవార్డులో 258 మంది ఓటర్లున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ఎండుతున్న వేరుశనగ పంట

- పట్టించుకోని అధికారులు
- లబోదిబో మంటున్న రైతులు



ప్రజాశక్తి-గుడిపల్లి: మండల పరిధిలో రైతులు వేరుశనగ విత్తనాలు సుమారు 210 హెక్టార్లలో సాగు చేశారు. వరుణ దేవుడు కరుణించకపోవడంతో వేరుశనగ పంట తీవ్రంగా ఎండిపోతోందని మండల రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతన్నలను అధికారులు పట్టించుకోవడం లేదని, వారికి ఎలాంటి సూచనలు, సమాచారం ఇవ్వడం లేదని వారు లబోదిబోమంటున్నారు. ఈ రెండు, మూడు రోజులలో వర్షాలు రాకుంటే వేరుశనగ పంటలు పూర్తిగా రైతుకి అందుకుండా పోతాయని, దీంతో రైతులు పంటకు ఖర్చు చేసిన సొమ్ము కూడా చేతికి రాక అప్పుల పాలయ్యే అవకాశం ఉంటుందని వారు అంటున్నారు. సంబంధిత జిల్లా కలెక్టర్ పరిశీలించి వేరుశనగ రైతులను ఆదుకోవాలని రైతన్నలు ప్రాధేయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వేరుశనగ పంటపై దష్టి సారించి గత ప్రభుత్వంలో రైన్‌గన్‌లను తీసుకుని వచ్చి ఎండిపోతున్న పంటలను సహితం నీటి ట్యాంకర్ల ద్వారా ఉచితంగా పంటలను కాపాడారని, ఇప్పటికైనా అలాంటి పరికరాలను అందించి రైతులకు సహాయం చేయాలని వారు వేడుకుంటున్నారు.

అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను అప్పగించాలి



ప్రజాశక్తి-పెద్దపంజాణి: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్సు ద్వారా నిజమైన పేదలనుండి ఏ కారణం చేతనైనా అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను తిరిగి వారికి లేదా వారి వారసులకు అప్పగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అంగేరి ఓబుల్ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహశీల్దార్ లోకేశ్వరరావుకు వారు వినతి పత్రం అందించినట్లు తెలిపారు. అనంతరం కుల వివక్ష పోరాటసమితి జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నూరు ఈశ్వర్ మాట్లాడుతూ 20 సంవత్సరాలకు ముందు అన్యాక్రాంతమైన భూములను తిరిగి ఎవరికి అప్పగిస్తారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, ఇది ఈ రాష్ట్రంలో పేదలైన అసైన్డ్ లబ్దిదారులకు అన్యాయం జరుతుందనే భయాందోళనలో పేదలు, దళితులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా యంత్రాంగం ఈ అనుమానాలను నివృత్తి చేసి అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను తిరిగి అసలైన లబ్దిదారులకు లేదా వారి వారసులకు స్వాధీనం చేసి న్యాయం చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వం చేతిలోవున్న భూములు, ఇప్పటికే అనర్హుల చేతిలో వున్న ప్రభుత్వ భూములను తీసుకొని భూమిలేని పేద, దళితులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మొత్తం ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగకుండా జిల్లా యంత్రాంగం నిజాయితీగా చిత్తశుద్ధితో వ్యవహరించి పేదలకు న్యాయం చేయాలని కోరారు.

ఉద్యోగుల స్పందనకు 12 అర్జీలు



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి మూడవ శుక్రవారం స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా శుక్రవారం ఈకార్యక్రమానికి వివిధ శాఖలకు సంబంధించి 12 అర్జీలు అందాయని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల ఉద్యోగుల నుండి అర్జీలను స్వీకరించారు. ఉద్యోగుల స్పందన కార్యక్రమానికి రెవెన్యూశాఖ 4, డిఆర్‌డిఎ 2, బోర్డ్ ఆఫ్ ఇంటర్ మీడియట్ ఎడ్యుకేషన్ 4, వ్యవసాయ శాఖ 1, జిల్లా కో-ఆపరేటివ్ 1, మొత్తం 12 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమం ద్వారా అందిన అర్జీలపై సత్వరం చర్యలు గైకొని పరిష్కరించాల్సిందిగా డిఆర్ఒ, జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మామిడి దిగుబడి తర్వాత తోటలో యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కరిడివారి పల్లి గ్రామంలో మామిడి రైతు వేణుగోపాల్ రెడ్డి తోటలో మామిడిలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు మండల ఉద్యాన శాఖ అధికారి లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మామిడి పంటలో కోత అనంతరం యాజమాన్య పద్ధతులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని, పంటకోత అనంతరం చేపట్టే యాజమాన్య పద్ధతులపైనే పంట దశలో వచ్చే దిగుబడి ఆధారపడి ఉంటుందని తెలిపారు. పంటలో సాగు ఖర్చులు తగ్గించే విధంగా రైతులకు అవగాహన కలిగి ఉండాలన్నారు. కోత అనంతరం మామిడి చెట్లకు కొమ్మల కత్తిరింపులు జరపాలని, అనంతరం 1 లీటర్ నీటిలో 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. పంటలో జనుము, జీలుగ, పిల్లిపెసర లాంటి పచ్చి రొట్ట నిచ్చే పంటలను పెంచి కలియ దున్నాలని తెలిపారు. ఉద్యాన అధికారి లక్ష్మీ ప్రసూన ఉద్యాన శాఖలో అమలవుతున్న పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పాలకూర రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, మామిడి రైతులు, ఆర్‌బీకే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం ఇవ్వాలి



ప్రజాశక్తి-పుంగనూరు: రేషన్ బియ్యం ఎలాంటి అవకతవకలు లేకుండా సక్రమంగా అందించాలని మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు పరిధిలోని తోపుమఠం ప్రాంతానికి చెందిన మహిళలు పేర్కొన్నారు. శుక్రవారం వారు తోపుమఠం వద్ద జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కూలి చేస్తే తప్ప పూట గడవని పరిస్థితుల్లో మేము జీవనం కొనసాగిస్తున్నాం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న చౌక దుకాణాల ద్వారా రావాల్సిన నిత్యవసర వస్తువులు గత మూడు నెలలుగా మాకు ఇవ్వడం లేదని ఆరోపించారు. చౌక దుకాణంలో పేదలకు సరఫరా చేస్తున్న బియ్యం సక్రమంగా రేషన్ కార్డు దారులకు ఇవ్వలేదని పలుమార్లు స్థానిక కౌన్సిలర్ ఎంఎస్ కసేరున్నీషా, తహశీల్దార్ శీతారాంకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. మాకు జరుగుతున్న అన్యాయాన్ని అధికారుల దష్టికి తీసుకెళ్లడానికే ఈ దర్నా చేయవలసి వచ్చిందన్నారు. ధర్నాతో రహదారిపై కొన్ని కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాకు రావలసిన రేషన్ బియ్యాన్ని ఇప్పించాలని వారు కోరారు. పుంగనూరు మున్సిపల్ పరిధిలో ఇదే తరహాలో పలు ప్రాంతాల్లో రేషన్ బియ్యం ఇవ్వట్లేదని తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

మహిళా ప్రగతి చంద్రబాబుతోనే సాధ్యం



ప్రజాశక్తి-రామకుప్పం: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు తోనే రాష్ట్రంలోని మహిళల ప్రగతి సాధ్యమని రామకుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు ఆనంద్ శుక్రవారం పేర్కొన్నాడు. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు మహిళల కోసం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని, మహిళా ప్రగతికి కృషి చేస్తే ఆయన బాటలో నడుస్తున్న చంద్రబాబు, లోకేష్ లు రాష్ట్రంలో మహిళల కోసం మహా శక్తి కార్యక్రమం ద్వారా విద్యా, వైద్య, ఉద్యోగ రంగాల్లో పురుషులతో పాటు మహిళలకు సమాన అవకాశాలు కల్పించిన ఘనత చంద్రబాబు నాయుడుదేనని నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ, మహాశక్తి కోఆర్డినేటర్ కమతమూరు ప్రతాప్ పేర్కొన్నారు. రామకుప్పం పట్టణంలోని హైస్కూల్ వీధి, ఇందిరానగర్, ఎంపీడీవో ఆఫీస్ రోడ్డు ప్రాంతాలలో మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో చంద్రబాబు నాయుడు పట్టణంలో చేసిన అభివద్ధి కార్యక్రమాలను, ప్రజల కోసం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను, నూతనంగా ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాలను వివరించి రానున్న శాసనసభ ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి అలివేలు మంగమ్మ, జిల్లా నేత చంద్రకళ, మండల మహిళా అధ్యక్షురాలు పద్మమ్మ, రాణమ్మ, పట్టణ పార్టీ నేతలు సలాం సాబ్, చంద్రశేఖర్, బాలరాజు, ఆదిల్ భాష తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాల ఆర్థిక ఎదుగుదలే లక్ష్యం

ప్రజాశక్తి-నగరి: సౌత్ ఇండియన్ ఫిన్ వెస్ట్ ప్రైవేటు బ్యాంకు సంస్థ ఫెడరల్ బ్యాంకు సహకారంతో గ్రామీణ, పట్టణంలో నివసించే మధ్యతరగతి, పేద కుటుంబాల మహిళల ఆర్థిక ఎదుగుదలే లక్ష్యంగా లోన్లు మంజూరు చేస్తూ, రుణ నగదును ఎలా సద్వినియోగం చేసుకొని సమాజంలో ఆర్థికంగా స్థిరపడేలా, ఏ రంగాల్లో పెట్టుబడి పెట్టాలనే సూచనలను, సలహాలను వర్క్ షాపులో సౌత్ ఇండియన్ ఫిన్ వెస్ట్ బ్యాంకు రీజినల్ మేనేజర్ శుక్రవారం వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకు ద్వారా రుణాలు పొందాలంటే ఎనిమిది మంది సభ్యులతో కూడిన ఒక గ్రూపును ఏర్పాటు చేసుకోవాలని, ఆ గ్రూపుకి ఒకరు బాధ్యత వహిస్తూ బ్యాంకు నుంచి రుణం పొందిన తర్వాత ప్రతినెలా భాధ్యత తీసుకున్న సభ్యురాలు మిగతా సభ్యులతో రుణాన్ని వసూలు చేసి బ్యాంకుకు చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ పాల్గొన్నారు.



మొక్కలను పెంచాలి



ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు సమీపంలోని చెరువు పరిసరాలలో శుక్రవారం మర్రి మొక్కలను పలమనేరు ప్రకృతి కన్వీనర్ మల్లిచెట్ల దేవేంద్ర నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మర్రి, రావి, వేప, మామిడి, చింత, నేరేడు మొదలగు మహా వృక్షాలను నాటి పెంచి తర తరాలకు ఆదర్శం కావాలని చెప్పారు. మర్రి చెట్లు కనుమరుగవుతున్నాయని, చెరువు పరిసరాలలో, గుట్టల్లో అడవి పక్కన మర్రి మొక్కలను నాటాలన్నారు. మొక్కలు కావలసినవారు సంప్రదించవలసింది గా దేవేంద్ర కోరారు. కార్యక్రమంలో శీను పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి-వెదురుకుప్పం: వెదురుకుప్పం ఎస్సైగా రమేష్ బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై లోకేష్ చిత్తూరు విఆర్ కు వెళ్లారు. దీంతో ఎస్‌ఆర్ పురం ఎస్సై షేక్షావలి ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-నగరి: విద్యుత్ సబ్‌స్టేషన్ల సర్వీసులో భాగంగా శనివారం నగరి, నెత్తం కండ్రిగ, రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నివాసితులు సహకరించాలని ఆయన కోరారు.

మొదలైన ఎన్నికల వాతావరణం



ప్రజాశక్తి-కుప్పం: రాష్ట్ర వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలకు ఇంకా గడువు ఉన్నా కుప్పం నియోజకవర్గ పరిధిలో తెలుగు యువత నిర్వహిస్తున్న సైకిల్ యాత్రతో ఎన్నికల వాతావరణం మొదలయ్యిందనే చెప్పాలి. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు తెలుగు యువత రామకుప్పం మండలం నుండి ప్రారంభించిన సైకిల్ యాత్ర రామకుప్పం, శాంతిపురం మండలాలలో పూర్తిచేసుకుని, నియోజకవర్గ కేంద్రమైన కుప్పం పురపాలక సంఘం పరిధిలో మూడు రోజులపాటు నిర్విరామంగా కొనసాగింది. పురపాలక సంఘం పరిధిలో సైతం యాత్ర మండల గ్రామ పరిధిలో శుక్రవారం ప్రారంభమైంది. కుప్పం రూరల్ ప్రాంతాలలో కొనసాగాల్సిన సైకిల్ యాత్ర గుడ్లనాయనపల్లి గ్రామంలో ప్రారంభమైంది. సైకిల్ యాత్ర నిర్వహిస్తున్న తెలుగు యువతను ఉత్తేజ పరిచేలా టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రతి గ్రామాన్ని పసుపు మయంగా అలంకరిస్తున్నారు. అంతేకాక స్థానిక ప్రజలు సైతం సైకిల్ యాత్రపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ప్రధానంగా మహిళలు సైకిల్ యాత్ర నిర్వహిస్తున్న తెలుగు యువతకు మంగళహారతులు పట్టి స్వాగతం పలుకుతున్నారు. ప్రజల ఆదరాభిమానాలతో తెలుగు యువత రెట్టింపు ఉత్సాహంతో తమ యాత్రను కొనసాగిస్తుంది.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్



ప్రజాశక్తి-నగరి: మండలంలోని ఓజీ కుప్పం గ్రామంలో సారా విక్రయిస్తున్న పి.మునిలక్ష్మి (60) అనే మహిళను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ వర్ధనాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం అరెస్ట్ చేశారు. వివరాలు.. ముందస్తు సమాచారం మేరకు సారావిక్రయాలపై గ్రామంలో సిబ్బందితో కలిసి తనిఖీ నిర్వహించిన వర్ధనా దేవి సారా విక్రయిస్తున్న మునిలక్ష్మిని అదుపులోకి తీసుకొని ఆమె వద్ద నుంచి 4 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోర్టుకు తరలించగా ముద్దాయికి రిమాండ్ విధించి చిత్తూరు జైలుకు పంపారు. తనిఖీలో ఎస్ఐ భానుప్రకాష్, హెడ్‌కానిస్టేబుల్ బాలముని, మోహన్‌రెడ్డి, పీసీలు హిదయతుల్లా, కృష్ణవేణి, గురవయ్య పాల్గొన్నారు.

మాకు రక్షణ కల్పించాలి



ప్రజాశక్తి-పలమనేరు: రూరల్ మండలం కొలమాసనపల్లి గ్రామానికి చెందిన భూస్వామి రత్నారెడ్డి అనుచరుల నుండి రక్షణ కల్పించాలని అదే గ్రామానికి చెందిన వద్ధ దంపతులు గంగప్ప, గంగోజమ్మ శుక్రవారం ప్రభుత్వ అధికారులను వేడుకున్నారు. వారు తెలిపిన వివరాల మేరకు.. కొలమాసనపల్లి గ్రామంలో పూర్వీకులు సంపాదించిన ఇంటి స్థలాన్ని గ్రామ భూస్వామి రత్నారెడ్డి ఫ్యాక్టరీ ప్రహరీ గోడకు ఆ స్థలాన్ని తీసుకొని శవన్ కాలనీలో ఉన్న ప్రభుత్వ ఇంటి స్థలాన్ని తనకు అప్పజెప్పిందని వివరించారు. అదే ప్రాంతంలో ఇతరుల వద్ద తాను ఇంటి స్థలాన్ని కొనుగోలు చేసుకుని ఇల్లు నిర్మిస్తుంటే మా గ్రామానికి చెందిన రత్నారెడ్డి అనుచరులను రెచ్చగొట్టి నిర్మాణ పనులు నిలిపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను కొనుగోలు చేసిన ఇంటి స్థలంలో ఆమె అనుచరులు దౌర్జన్యంగా సిమెంట్ సీట్లు వేయడంతో ఈ విషయంపై పలమనేరు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయగా శుక్రవారం రెవెన్యూ సిబ్బంది గ్రామానికి వచ్చి వారు దౌర్జన్యంగా వేసిన సిమెంట్ సీట్లు తొలగించడంతో రెచ్చిపోయిన రత్నారెడ్డి అనుచరులు తాను పశువులకు వేసుకున్న కొట్టాన్ని దౌర్జన్యంగా ధ్వంసం చేసి నేల మట్టం చేశారని కంటతడి పెట్టారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశానని నా ప్రత్యర్థులు 20 మంది వరకు ఉన్నారని వారిని ఎదిరించ లేని స్తోమత వృద్ధులైన మాకు లేదన్నారు. మేము గ్రామంలో బతకాలంటే కూడా ప్రాణాల అరచేతిలో పెట్టుకొని బిక్కు, బిక్కుమంటున్నామని పోలీసులు, రెవెన్యూ సిబ్బంది వారి ఆగడాలు అరికట్టి తన కుటుంబానికి రక్షణ కల్పించాలని వృద్ధ దంపతులు వేడుకుంటున్నారు.

ఇద్దరి పిల్లలతో తల్లి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ఇద్దరు బిడ్డలతోపాటు తల్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు.. గంగాధరనెల్లూరు మండలం చిన్నదామరగుంట గ్రామానికి చెందిన మహిళా వాలంటీర్ ఉమామహేశ్వరి, భర్త చంద్రశేఖర్ రెడ్డిలు అప్పుడప్పుడు తగాదాలు పడుతుండేవారు. గత గురువారం రాత్రి సైతం వారు తగాదా పడ్డారు. దీంతో శుక్రవారం ముగ్గురు బిడ్డలతో పాటు తాను పురుగు మందులతాగి ఆత్మహత్యాయత్నం చేసుకోవాలనుకుంది. ఆ క్రమంలో మొదటగా ఇద్దరు మగ బిడ్డలకు పురుగుల మందు తాగిపిచ్చి తర్వాత ఆడబిడ్డకు తాగిపిచ్చేందుకు చూడగా ఆడబిడ్డకు అనుమానం వచ్చి తాగకుండా ఇంట్లో నుంచి అరుస్తూ వీధిలోకి వచ్చేసింది. దీంతో చుట్టుపక్కల వారు వెంటనే స్పందించి ఇంట్లోకి వెళ్లి తల్లీబిడ్డలను వెంటనే కారులో ఎక్కించుకొని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లీ బిడ్డలు క్షేమంగా ఉన్నట్లు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు ధ్రువీకరించినట్లు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులతో పాటు గ్రామంలోని బంధువులు ఊపిరి పీల్చుకున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత



ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్ : నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని నగర కమిషనర్ డా. జె అరుణ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు.. శుక్రవారం నగర పాలక కా ర్యాలయంలో 'ఉద్యోగుల కోసం ప్రత్యేక స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ మాట్లా డుతూ నగరపాలక పరిధిలో విధులు నిర్వహించే అందరి ఉద్యోగ సంబంధిత సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కొన్ని సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న సమస్యలను చాలా వరకు పరిష్కరించామన్నారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గోపాలకష్ణ వర్మ ఆధ్వర్యంలో ఉద్యోగులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఒక్కరోజులో రూ.కోటి రుణాలు



ప్రజాశక్తి-యాదమరి: స్థానిక యూనియన్ బ్యాంకులో శుక్రవారం ఒక్క రోజే బంగారంపై రూ.కోటి రుణాలు ఇచ్చినట్లు బ్యాంక్ మేనేజర్ పి మురళి తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకులో ఖాతాదారుల నడుమ వారు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ వ్యవసాయ పొలం ఉండి బంగారు తాకట్టు పెట్టిన వారికి అతి తక్కువ వడ్డీ 33 పైసలతో రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. రుణాలు పొందిన రైతులు సకాలంలో చెల్లించి బ్యాంకు అందించే సబ్సిడీకి అర్హులవుతారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతుల శ్రేయస్సుకు బ్యాంకు రుణాలు ఇంత పెద్ద మొత్తం ఒక్కరోజులోనే పలువురు రైతులకు ఇవ్వడంపై బ్యాంకు సిబ్బందిని ఖాతాదారులు అభినందించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ సి కిషోర్, ఫీల్డ్ ఆఫీసర్ టీఎస్ నరేష్, స్పెషల్ ఆఫీసర్ భువన, క్యాషియర్ కిషోర్, గౌతమ్ పాల్గొన్నారు.